క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్స్ పంపిణీ



విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్స్ అందిస్తున్న దాత శివశంకర్‌గౌడ్

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్‌తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత శివశంకర్‌గౌడ్ విద్యార్థుల పట్ల ఉదారత చాటుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఆయన బుధవారం తన సొంత ఖర్చులతో భోజన ప్లేట్స్, వాటర్ బాటిల్స్, గ్లాసులను అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ అంగూర్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాయకులు, వ్యాపారులు తమవంతు సహకారం అందించాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నమ్మ, నాయకులు సురేష్, సతీష్, శశిరేఖ, రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

షెడ్ నిర్మాణానికి భూమిపూజ

కొందుర్గు: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో పేరెంట్స్ సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న షెడ్ నిర్మాణ పనులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుంజల్‌పహాడ్ గ్రామస్తుడు కృష్ణ పాఠశాల ఆవరణలో రూ.2లక్షల సొంత ఖర్చుతో షెడ్ నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. కృష్ణను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ముందుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి నిస్సీ షేకీనా, నాయకులు జహంగీర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు



ముర్తూజగూడలో ఫార్మర్ రిజిస్ట్రీని పరిశీలిస్తున్న సురేష్‌బాబు

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: ప్రతీ రైతు తమ వివరాలను వ్యవసాయాధికారులకు తెలియజేసి ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయించుకోవాలని చేవెళ్ల ఏడీఏ సురేష్‌బాబు సూచించారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని ముర్తూజగూడ, మండల పరిధి చాకలిగూడలో ఫార్మర్ రిజిస్ట్రీ పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతుకు 11 అంకెల యూనిక్ కోడ్ కేటాయిస్తూ ఫార్మర్ రిజిస్ట్రీ జరుగుతుందన్నారు. దీని ఆధారంగానే కేంద్ర ప్రభుత్వ పథకాలు రైతులకు అందుతాయన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద వెంటనే ఫార్మర్ రిజిస్ట్రీని చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓలు సునీల్, కుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతల పూడ్చివేత



గుంతలను కాంక్రీటుతో పూడ్చివేయిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటేశం

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ రైల్వే బ్రిడ్జి నుంచి కంది వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గమనించిన చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం బుధవారం గుంతలు ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం సమీపంలోని రెడిమిక్స్ ప్లాంట్ ప్రతినిధులతో మాట్లాడి, రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కాంక్రీటు వేయించారు. ప్రమాదాల నివారణ కోసం ట్రాఫిక్ సీఐ చేసిన పని పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు

కొత్తూరు: పట్టణంలో బుధవారం ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ ముఖ్య కూడలిలో ఉన్న సంఘ భవనం వద్ద సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. విద్యారంగం, విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేయడానికి ఏబీవీపీ ముందుంటుందన్నారు. ఏబీవీపీ ఆవిర్భావం నుంచి నేటివరకు సాధించిన విజయాలు ఎన్నో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌చారి, శివకుమార్‌చారి, హర్షయాదవ్, శశికాంత్, అరవింద్, శ్రీకాంత్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



మేకగూడ శివారులోని ఓ వెంచర్‌లో నిత్యం పడేస్తున్న చెత్తాచెదారం



రంగాపూర్‌లో నిరుపయోగంగా ఉన్న డంపింగ్‌యార్డు

ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం

- గ్రామాల్లో వృథాగా సెగ్రిగేషన్ షెడ్లు
- నామమాత్రంగా తడి, పొడి చెత్త సేకరణ
- నిర్వహణ లోపంతో నీరుగారుతున్న లక్ష్యం
- పట్టించుకోని కార్యదర్శులు

నందిగామ: గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్ది, ఇళ్లలో సేకరించిన చెత్తతో సేంద్రియ ఎరువుల తయారీ కోసం గత ప్రభుత్వం నిర్మించిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి. కార్మికులకు చెత్త సేకరణపై అవగాహన లేకపోడవంతో చెత్తను గ్రామాల సమీపంలో వేసి దహనం చేస్తున్నారు. దీంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. ఎరువుల తయారీతో ఆదాయం పొందడం దేవుడెరుగు.. కొన్ని పంచాయతీలు వీటి నిర్వహణను గాలికొదిలేశాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది.

నిధులు వృథా..

మండలంలోని 18 పంచాయతీలలో గత పభుత్వంలో ఉపాధి హామీ, స్వచ్ఛ భారత్ నిధులతో టైప్–1 షెడ్లు 11 నిర్మించగా, టైప్–2 షెడ్లు 7 డంపింగ్, వర్మీకంపోస్టు షెడ్లను నిర్మించారు. ఉపాధి హామీ నిధులతో కొన్ని గ్రామాల్లో టైప్–1 షెడ్లకు రూ.1.2 లక్షలు, టైప్–2 షెడ్ల నిర్మాణాలకు రూ.2.5 లక్షలు ఖర్చు చేశారు. వీటిని డంపింగ్‌యార్డులు, వర్మీకంపోస్టు ఎరువు తయారీకి వినియోగించేలా నిర్మించారు.

నిర్వహణ ఇలా..

- గ్రామాలలో పారిశుద్ధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. సేకరించిన చెత్తలో నుంచి ప్లాస్టిక్‌ను వేరుచేసి మిగిలిన దానిని సమీపంలో నిర్మించిన కంపోస్టు షెడ్‌లో వేయాలి.
- కంపోస్టు షెడ్‌లో చెత్త ద్వారా తయారైన సేంద్రియ ఎరువులను గ్రామాలు, రోడ్ల పక్కన నాటిన మొక్కలకు ఎరువుగా వేయాలి.
- మిగిలిన ఎరువులను గ్రామ రైతులకు విక్రయించి, వచ్చిన సొమ్మును గ్రామ పంచాయతీలో జమచేయాలి. దీంతో పాటు ప్లాస్టిక్‌ను సైతం విక్రయించి వచ్చిన సొమ్మును జీపీలో జమచేయాలి,
- గ్రామస్తులకు తడి, పొడి చెత్తపై ఎప్పటికప్పుడూ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

జరుగుతున్నదిలా..

- మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో కొన్ని జీపీలు మినహాయిస్తే చాలా వరకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం లేదు.
- సేకరించిన చెత్తను డంపింగ్‌యార్డులలో, కంపోస్టు యార్డులలో నామమాత్రంగా వేసి, అధిక భాగం గ్రామ సమీపంలోని ఖాళీ ప్రదేశాల్లో, వాగులు, వంకలు, పాడు బడిన వెంచర్లలో వేసి తగులబెడుతున్నారు.
- చెత్త సేకరణపై ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో కొంతమంది కార్యదర్శులు, పారిశుద్ధ్య కార్మికులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఎందుకిలా..

తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అప్పట్లో ఆయా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి రెండు బుట్టలను ఉచితంగా పంపిణీ చేశారు. మొదట్లో కొన్నిరోజుల పాటు గ్రామాల ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి ఇచ్చారు. కానీ కొన్నిరోజుల తర్వాత ప్రజలు మొత్తం ఒకే దగ్గర వేసి అందించడం.. గ్రామ పంచాయతీ కార్మికులు సైతం ఆ విధంగానే తీసుకోవడం ప్రారంభించారు. ఈ చెత్తను వేరు చేయడం చాలా శ్రమతో కూడుకున్నది కావడం, దీనికి తోడు కార్మికులకు గ్రామంలో అనేక పనులు ఉండటంతో అటు పంచాయతీ కార్యదర్శులు, ఇటు సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

అధికారులు ఏం చేస్తున్నట్లు?

గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఎప్పటికప్పుడూ దృష్టి సారించాల్సిన అధికారులు తడి, పొడి చెత్తపై అంతగా దృష్టి సారించడం లేదనే ఆరోపనలు ఉన్నాయి. గ్రామాల్లో పర్యటించి చెత్త సేకరణ విషయమై ఉన్నతాధికారులు దృష్టి సారించి, కార్యదర్శులు, పారిశుద్యకార్మికు పనితీరును నిత్యం పర్యవేక్షించి, నిర్లక్ష్యం వహించిన వారిపై తగిన చర్యలు తీసుకుంటే తప్పా ఈ పథకం సక్రమంగా అమలయ్యే అవకాశం లేదు.

చర్యలు తీసుకుంటాం



గ్రామాల్లో నిత్యం సేకరించిన చెత్తాచెదారాలతో డంపింగ్‌యార్డులు నిండిపోతున్నాయి. దీంతో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. సుమారు 50 శాతం గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది. మండలంలో టైప్–1 కంపోస్టు షెడ్లు 11 ఉండగా, టైప్–2 డంపింగ్ షెడ్లు 7 ఉన్నాయి. టైప్–1 షెడ్ల పరిమితిని పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– తేజాసింగ్, ఎంపీఓ

ప్రభుత్వ మొండి వైఖరి సరికాదు

- ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి

మొయినాబాద్: ఎనికేపల్లి రైతులపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లిలో గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న రైతులు చేపడుతున్న నిరసన కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు నష్ట పరిహారం విషయం తేల్చకుండా భూములు తీసుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. సుమారు నెలరోజులుగా రైతులకు ఇచ్చే పరిహారాన్ని తేల్చకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. రైతుల డిమాండ్ మేరకు పరిహారం ఇవ్వాలన్నారు. రైతుల న్యాయమైన పోరాటానికి బీఆర్‌ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జయవంత్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, డప్పు రాజు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీహరియాదవ్, సుధాకర్‌యాదవ్, రాఘవరెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మోర శ్రీనివాస్, నాయకులు నర్సింహాగౌడ్, తిరుపతిరెడ్డి, పాషా, సంజీవరావు, రాంరెడ్డి, సత్తిరెడ్డి, లక్ష్మీనారాయణ, పరమేశ్, అరవింద్, చిన్న తదితరులు ఉన్నారు.



రైతులకు సంఘీభావం తెలుపుతూ మాట్లాడుతున్న అనంతరెడ్డి

గురుపూర్ణిమను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న హిందూ జన జాగృతి సమితి రాష్ట్ర ప్రతినిధి చేతన్

నందిగామ: హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని చేగూరులో నిర్వహించనున్న గురుపూర్ణిమను విజయవంతం చేయాలని హిందూ జన జాగృతి సమితి రాష్ట్ర ప్రతినిధి చేతన్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానం అనే ప్రకాశాన్ని ఇచ్చే వారే గురువులు అని, అలాంటి గురువుకు కృతజ్ఞత తెలుపుకునే రోజును గురుపూర్ణిమగా భావిస్తామన్నారు. గురువారం సాయంత్రం 5.30 గంటలకు చేగూరులోని వినాయక గార్డెన్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రతి ఒక్కరూ హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా శంకరనాథ మహోత్సవం వీడియో, స్వీయరక్షణ కళా ప్రదర్శన వీడియో, దీంతో పాటు రాజ మహారాజులు, విప్లవకారులు యుద్ధం కోసం ఉపయోగించిన ప్రాచీనమైన ఆయుధాల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆధ్యాత్మిక సాధన, హిందూ సంస్కృతి సంప్రదాయాలు, ఆయుర్వేదం, ధర్మరక్షణ, ధర్మ జాగృతి, దేశ రక్షణకు సంబంధించి ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న మహ్మద్ అలీఖాన్‌బాబర్

- మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతో కృషి చేస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం జిల్లా మినరల్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ప్రభుత్వం రూ.1.20లక్షలు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులతో జిల్లేడ్‌చౌదరిగూడ మండలంలో రెండు, కేశంపేట మండలంలో నాలుగు, ఫరూఖ్‌నగర్ మండలంలో ఒకటి, నందిగామ మండలంలో మూడు చొప్పున అభివృద్ధి పనులను చేపడతామన్నారు. ఈ నిధులను పాఠశాల అదనపు తరగతి గదులు, సీసీ రోడ్లు, రహదారి నిర్మాణం పనులకు వినియోగించనున్నారని తెలిపారు. త్వరలో టెండర్లను పూర్తి చేసిన వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేస్తూ నిధులను మంజూరు చేయించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నిధుల మంజూరు ఉత్తర్వులను జారీ చేసిన కలెక్టర్ నారాయణరెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, ఆదివాసీ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్ రఘునాయక్, చౌదరిగూడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాజు, నాయకులు ఎండీ.ఇబ్రహీం, కృష్ణారెడ్డి, అగ్గనూరు బస్వం, మురళీమోహన్, పుల్లారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

బ్యాగుల పంపిణీ



బ్యాగులు పంపిణీ చేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పలకలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతల సహకారం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఉత్తీర్ణతను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల, నేర నియంత్రణ సంస్థ ప్రధాన కార్యదర్శి శ్రీహరి, లీగల్ అడ్వైజర్ నర్సింగ్, ప్రోగ్రాం ఆర్గనైజర్ సందీప్, పాఠశాల ఎస్‌ఎంసీ చైర్‌పర్సన్ అలివేలు, నాయకులు అక్కిగారి శ్రీధర్, మహేందర్, నరేశ్, పెంటయ్య, నర్సింలు, శివకుమార్, అఖిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం

- గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శైలజ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

షాద్‌నగర్: విద్యార్థులు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో అవసరమని మహిళా గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శైలజ అన్నారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ మహిళా గురుకుల కళాశాలలో చదువుతున్న గీత, ఐశ్వర్య కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి జోనల్ ఛాంపియన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ప్రిన్సిపాల్ విద్యార్థినులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు, యుద్ధవిద్యలు మానసికోల్లాసాన్ని కలిగించడంతో పాటు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రతి నిత్యం యుద్ధవిద్యలు సాధన చేయడంతో మెదడు చురుకుగా పనిచేయడంతో పాటుగా మేథోశక్తి పెరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ చిన్నప్పటి నుంచే యుద్ధవిద్యలు నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పీడీ రేణుక, రాష్ట్ర పాఠశాలల క్రీడల కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా శక్తి సంబురాలు



సంబురాల్లో పాల్గొన్న మహిళా సంఘం సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విర్యాల గ్రామ మహిళా సంఘం కార్యాలయంలో బుధవారం గ్రామ సంఘం అధ్యక్షురాలు ప్రణీత ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీసీ శివకుమార్, వీఓఏ మొయినుద్దీన్ హాజరై రుణాలు, చెల్లింపులపై గ్రామంలో సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభున్నతికి కృషి చేస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం ప్రగతి సాధిస్తుందన్నారు. ప్రతీ మహిళను గ్రామ సంఘంలో సభ్యురాలిగా చేర్పించడంతో పాటుగా వారికి రుణాలను అందించి వారి అభివృద్ధికి తోడ్పాటునందించాలన్నారు. మహిళా సంఘం సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం కార్యదర్శి లక్ష్మమ్మ, కోశాధికారి చిట్టెమ్మ, సభ్యులు యాదమ్మ, లక్ష్మి, శశికళ, కొమురమ్మ, నవీన, మంజుల, అలివేలు, సలీమా భేగం, మానస, జ్యోతి, గ్రామ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల 'సిల్వర్ జూబ్లీ'



వేడుకల్లో పాల్గొన్న పోలీసులు

మొయినాబాద్: ఇరవై ఐదు సంవత్సరాల క్రితం పోలీసు ఉద్యోగంలో చేరి వివిధ ప్రాంతాల్లో పని చేస్తున్నవారందరూ బుధవారం ఒకచోట చేరారు. ఇరవై ఐదేళ్ల అనుభవాలు, అనుభూతులను ఒకరికొకరూ పంచుకున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన 2000ల సంవత్సరం బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్లు ఉద్యోగంలో చేరి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్ సమీపంలో ఉన్న కంట్రీసైడ్ రిసార్ట్‌లో సిల్వర్ జూబ్లీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బ్యాచ్‌లో మొత్తం 280 మంది ఉండగా.. అందులో 13 మంది మరణించారు. 16 మంది ఎస్సైలుగా సెలెక్ట్ అయ్యి ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐ, డీఎస్పీలుగా పదోన్నతులు పొందారు. కాగా వీరిలో 180 మంది బుధవారం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో పాల్గొన్నారు. 25 ఏళ్ల పోలీసు ఉద్యోగ జీవితంలోని అనుభవాలను, అనుభూతులను పంచుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని రోజంతా సంతోషంగా గడిపారు.

నీటి సమస్య పరిష్కారానికి సహకారం



పైపులైన్ వేయిస్తున్న దాత శేఖర్, హెచ్‌ఎం సంగీత

చేవెళ్ల: పాఠశాలలో నీటి సమస్యను పరిష్కరించేందుకు దాత ముందుకు రావటం అభినందనీయమని దామరగిద్ద హెచ్‌ఎం సంగీత అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని దామరగిద్ద ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు గతంలో ఉన్న నల్లా కనెక్షన్ సక్రమంగా లేక నీళ్లు రాకపోవటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై గ్రామస్తులతో చర్చించి విద్యార్థులకు నీటి సౌకర్యం కోసం ప్రత్యేక పైపులైన్ వేయించాలని కోరామన్నారు. అడిగిన వెంటనే గ్రామానికి చెందిన ఘనపురం శేఖర్ ముందుకొచ్చి తన సొంత నిధులు రూ.35వేలు ఖర్చు చేసి పైపులైన్ వేయించి సమస్య పష్కరించారన్నారు. నీటి సౌకర్యం కల్పించేందుకు సహకరించిన దాత శేఖర్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో పాఠశాలలో విద్యార్థుల కోసం వాటర్ ఫిల్టర్‌ను సైతం అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు ఉన్నారు.

కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్రం

- సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య
- వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు

చేవెళ్ల: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ దేశవ్యాప్తంగా చేపడుతున్న సమ్మెలో భాగంగా చేవెళ్ల నియోజకవర్గంలో కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలో సీఐటీయూ, ఏఐటీయూసీల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్మికులు, ప్రజలతో ర్యాలీలు, నిరసనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సీఐటీయు జిల్లా కార్యవర్గ సభ్యుడు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. శతాబ్ది కాలంగా కార్మిక వర్గాలు అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి.. వాటి స్థానంలో 4 లేబర్ కోడ్‌లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. హక్కులు హరించే లేబర్ కోడ్ బిల్లులు మాకొద్దని.. కార్మికులు సాధించుకున్న చట్టాలనే అమలులో ఉంచాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్, మున్సిపల్ యూనియన్ జిల్లా నాయకుడు రత్నం, నాయకులు మల్లేశ్, ప్రభుదాస్, నర్సింహ, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి లక్ష్మీ, ఉమారాణి, స్వప్న, సీపీఐ, ఏఐటీయుసీ నాయకులు కె. రామస్వామి, సత్యనారాయణ, ప్రభులింగం, సుధాకర్‌గౌడ్, సత్తిరెడ్డి, మక్బుల్, సుభాన్‌రెడ్డి, శ్రీనివాస్, సుదీర్, శ్రీశైలం, మంజుల, మీనాక్షి, గోపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్, పంచాయతీ కార్మికులు తదితరులు ఉన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం

కేశంపేట: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ వర్కర్లు, ఆశకార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ వర్కర్లు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి, నాయకులు రాంచంద్రయ్య, పారేశ, రవి, వీరేశం, పద్మ, రమేశ్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశలు, అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి

కొత్తూరు: ఆశవర్కర్లు, అంగన్‌వాడీలతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా కోరారు. అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల సాధనకు చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కొత్తూరులో బుధవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను తప్పించే విధంగా చట్టాల సవరణ ప్రక్రియను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, కిరియా, గణేష్, కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



కేశంపేట: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



కొత్తూరు: నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నేతలు